Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

సోమవారం, అక్టోబరు 13, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## శాంతి శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని బదులు మంత్రి కేవీ సింగ్

న్యూఢిల్లీ: ఈజిప్టులోని ఎర్ర సముద్ర తీర నగరం షర్మ్ ఎల్ షేక్‌లో సోమవారం జరిగే శాంతి శిఖరాగ్ర సదస్సు(పీస్ సమిట్)కు మన దేశం తరఫున కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ హాజరవనున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా 20కి పైగా దేశాల నేతలు పాల్గొనే ఈ సమావేశానికి రావాలంటూ ఈజిప్టు అధ్యక్షుడు ఎల్ సిసి ప్రధాని మోదీకి ఆదివారం ఆహ్వానం పంపించారు. అయితే, ఆయన తన బదులుగా మంత్రి కేవీ సింగ్‌ను పంపిస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గాజాతోపాటు పశ్చిమాసియాలో శాంతి నెలకొల్ప డమే లక్ష్యంగా జరిగే కార్యక్రమానికి ఈజిప్టు అధ్యక్షు డు ఎల్ సిసి, ట్రంప్ సహాధ్యక్షత వహించనున్నారు.






### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక..

## నేటి నుంచే నామినేషన్లు

షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం వద్ద 144 సెక్షన్ విధింపు

నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురికే లోపలికి అనుమతి

బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు.. బీజేపీపై ఉత్కంఠ

18 చెక్‌పోస్టులతో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుండటంతో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ల కేంద్రంగా ఉన్న షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఉప ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు ర్యాలీలుగా వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎన్నికల కార్యాలయం వద్దకు వాహనాలను పూర్తిగా నిషేధించారు. నామినేషన్ దాఖలు చేసే


(మిగతా 2వ పేజీలో)

# ఎస్సారెస్పీ స్టేజ్-2కు ఆర్డీఆర్ పేరు

నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత ఆయనదే

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి అండగా గాంధీ కుటుంబం

ఆర్డీఆర్ సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



తుంగతుర్తి, తిరుమలగిరి: 'ఫ్లోరోసిస్ పీడిత ప్రాంతమైన నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తెచ్చిన ఘనత రాంరెడ్డి దామోదర్‌రెడ్డిది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసి ఎస్సారెస్పీ స్టేజ్-2 సాధించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఒప్పించి ఎస్సారెస్పీ స్టేజ్-2 కాలువకు నీళ్లు తెచ్చారు. అందుకే ఎస్సారెస్పీ స్టేజ్-2 కాలువకు 'ఆర్డీఆర్ ఎస్సారెస్పీ-2 కాలువ'గా నామకరణం చేసున్నాం. దీనికి సంబంధించి 24 గంటల్లో జీవో విడుదల చేస్తాం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాంరెడ్డి దామోదర్‌రెడ్డి లేని లోటు తీర్చలేదని, ఎస్సారెస్పీ-2కు ఆర్డీఆర్ పేరు పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో ఆదివారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభలో రేవంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి

(మిగతా 2వ పేజీలో)

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి

::: రేవంత్ సర్కారుపై కేటీఆర్ ఫైర్

జూబ్లీహిల్స్ ప్రజలు కారు కావాలో, బుల్డోజర్ కావాలో తేల్చుకోవాలన్న కేటీఆర్

కాంగ్రెస్ పాలనలో పేదల ఇళ్ల కూల్చివేతలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణ

రెండేళ్లలో రూ. 2.80 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శ

ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్న కేటీఆర్

ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని పిలుపు

బీజేపీ తెలంగాణకు పనికిరాని పార్టీ అని ఎద్దేవా




జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి చిహ్నమైన 'కారు' గుర్తుకు ఓటేస్తారో, లేక విధ్వంసానికి ప్రతీకగా మారిన 'బుల్డోజర్'ను ఎంచుకుంటారో తేల్చుకోవాలని సూటిగా

(మిగతా 2వ పేజీలో)



## 42 % బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఏర్పాటు చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

తెలంగాణలో బీసీల ఐక్య గళం

42% రిజర్వేషన్ల కోసం జేఏసీ ఏర్పాటు

ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపు

### బీఎస్ఎఫ్

## తొలి మహిళాపైలట్ ఇంజనీర్‌గా భావనా చౌదరి

భావనా చౌదరి సహా అయిదుగురికి ఫ్లయింగ్ బ్యాడ్జ్‌లు






## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు

బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయం

నేడు ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బరిలో నిలిచే పార్టీ అభ్యర్థిని బీజేపీ అధిష్టానం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మూడు పేర్లను ముందు పెట్టుకుని చర్చించిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ..

(మిగతా 2వ పేజీలో)

# మహాఘట్‌బంధన్ సంయుక్త మేనిఫెస్టో

నేడు ఢిల్లీలో కాంగ్రెస్, ఆర్జేడీ కీలక భేటీ



న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అధికార ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు ఖరారైన నేపథ్యంలో విపక్ష 'మహాఘట్‌బంధన్' కూటమి పార్టీలు వడివడిగా

(మిగతా 2వ పేజీలో)

# వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేటే..



నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

నిర్మాణ రంగ వృద్ధి రేటు 11.97 శాతం

సెప్టెంబర్‌లో ఇళ్ల రిజిస్ట్రేషన్లలో 35 శాతం పెరుగుదల

రెండు, మూడు నెలల్లో 'ఏఐ' సిటీకి భూమి పూజ

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

'హైదరాబాద్, : '2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్‌డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది' అని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలెప్ మెంట్ కౌన్సిల్(నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్ లో నిర్వహిస్తున్న

(మిగతా 2వ పేజీలో)

# ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!

ఢిల్లీ: ఇజ్రాయెల్, గాజా శాంతి ఒప్పందం నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈజిప్ట వేదికగా సోమవారం జరగబోయే గాజా శాంతి ఒప్పందానికి హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానించారు. ఈ మేరకు జాతీయ మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. వివరాల ప్రకారం.. ఈజిప్ట్ వేదికగా రేపు ఇజ్రాయెల్ , గాజా మధ్య శాంతి ఒప్పందం జరుగబోతుంది. ఈ శాంతి ఒప్పందంలో ప్రధాని మోదీ హాజరు కావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆకాంక్షించారు. ఈ మేరకు

(మిగతా 2వ పేజీలో)



వాయిస్ టుడే

సోమవారం, అక్టోబరు 13, 2025

# కాంగ్రెస్‌కు ఓటేస్తే బుల్డోజర్లు వస్తాయి




ప్రశ్నించారు. ఈ ఉప ఎన్నిక ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గట్టి గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు చెర్క మహేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్లపై బుల్డోజర్ల దాడి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్‌లోని పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడుపుతున్నారని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులు, చట్టబద్ధమైన పత్రాలు ఉన్నప్పటికీ, వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా గరీబుల నివాసాలను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. "కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి జరగదు, బుల్డోజర్లు మాత్రమే వస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గ్రహించాలి" అని ఆయన హెచ్చరించారు. రెండు సంవత్సరాల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. అభివృద్ధిని గాలికి వదిలేసి, రాష్ట్రాన్ని రూ. 2.80 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు.

**హామీలన్నీ మోసమే...!**

ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. నెలకు రూ. 4 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావాలంటే, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడమే మార్గమని అన్నారు. "ఈ ఎన్నికలో అధికార పార్టీ ఓడిపోతేనే వారికి భయం పుట్టి హామీలను అమలు చేస్తారు. ఒకవేళ పొరపాటున గెలిపిస్తే, మనం ఎన్ని మోసాలు చేసినా ప్రజలు ఏమీ చేయలేరనే ధీమాతో ఉంటారు" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లు, అజారుద్దీన్‌కు ఎమ్మెల్సీ పదవి, ముస్లింలకు ఖబరస్థాన్ స్థలం వంటి విషయాల్లోనూ కాంగ్రెస్ మోసపూరితంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. "ప్రజలను తెలిసి తెలిసి మోసం చేయడమే రేవంత్ రెడ్డి నైజం. గతంలో 'మోసం చేసే వాళ్లనే ప్రజలు నమ్ముతారు' అని ఆయనే స్వయంగా చెప్పారు" అని కేటీఆర్ గుర్తుచేశారు.

**బీజేపీపైనా విమర్శలు**

ఈ సందర్భంగా బీజేపీపైనా కేటీఆర్ విమర్శలు గుప్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి ఏమాత్రం పనికిరాని పార్టీ అని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే ఆ ఓటును మోరీలో వేసినట్లేనని ఆయన ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఓటుకు రూ. 10,000 పంచి గెలవాలని చూస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కేసీఆర్ నాయకత్వం మళ్లీ రావాలని, అందుకు జూబ్లీహిల్స్ నుంచే నాంది పలకాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. రెండేళ్లుగా కేసీఆర్‌ను తిట్టడం మినహా రేవంత్ రెడ్డి ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

# బీఎస్ఎఫ్ తొలి మహిళాఫ్లైట్ ఇంజనీర్‌గా భావనా చౌదరి

**భావనా చౌదరి సహా అయిదుగురికి ఫ్లయింగ్ బ్యాడ్జ్‌లు**

న్యూఢిల్లీ: సరిహద్దు భద్రతా దళం వైమానిక విభాగం 50 ఏళ్లకు పైగా చరిత్రలో.. తొలి మహిళా ఫ్లైట్ ఇంజనీర్‌ను నియమించింది. ఈమె సంస్థలోనే తొలి అంతర్గత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఘనత సాధించడం విశేషం. ఇన్‌స్పెక్టర్ భావనా చౌదరి సహా అయిదుగురు పురుష సబార్డినేట్ అధికారులకు.. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ దల్జీత్ సింగ్ చౌధరి ఇటీవల ఫ్లయింగ్ బ్యాడ్జ్‌లను అందజేశారు. సరిహద్దు దళం 1969 నుండి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఏవియేషన్ యూనిట్‌ను నిర్వహణ బాధ్యతను నిర్వర్తిస్తోంది. ఇది అన్ని పారా మిలిటరీ దళాలు, ఎన్ఎస్‌జీ, ఎన్‌డీఆర్ఎఫ్ వంటి ప్రత్యేక దళాల కార్యాచరణ అవసరాలను తీరుస్తుంది. బీఎస్ఎఫ్ వైమానిక విభాగంలోని శిక్షకులు ఐదుగురు సబార్డినేట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. వీరు ఇటీవలే రెండు నెలల సుదీర్ఘ శిక్షణను పూర్తి చేశారు.

**130 గంటల తర్ఫీదు**

ఆగస్టులో ప్రారంభమైన ఈ రెండు నెలల అంతర్గత శిక్షణలో ఐదుగురు సిబ్బందికి 130 గంటల పాటు నైపుణ్యం అందించారు. శిక్షణ సమయంలో, పంజాబ్‌తో పాటు ఇతర రాష్ట్రాలలో ఇటీవల సంభవించిన వరదల్లో సహాయక చర్యల్లో పాల్గొనడం ద్వారా.. వీరు బీఎస్ఎఫ్ వైమానిక విభాగంలోని వివిధ విమానాలపై అనుభవం పొందారు.

**ఫ్లైట్ ఇంజనీర్లకు తీవ్ర కొరత**

'బీఎస్ఎఫ్ వైమానిక విభాగం దాని ఎంఐ%-%17 హెలికాప్టర్ల ఫ్లీట్‌లో ఫ్లైట్ ఇంజనీర్ల తీవ్ర కొరతను ఎదుర్కొంటోంది. భారత వైమానిక దళం మొదటి బ్యాచ్‌లోని ముగ్గురు సబార్డినేట్ అధికారులకు శిక్షణ ఇచ్చింది, అయితే వివిధ పరిమితుల కారణంగా ఐదుగురు సిబ్బందితో కూడిన రెండో బ్యాచ్ అక్కడ శిక్షణ స్లాట్‌ను పొందలేకపోయింది'.. అని ఒక అధికారి తెలిపారు. దీంతో బీఎస్ఎఫ్, తన వైమానిక విభాగంలో ఫ్లైట్ ఇంజనీర్ల కోసం అంతర్గత శిక్షణ నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని



ఎంహెచ్ఏను అభ్యర్థించింది. ఇన్‌స్పెక్టర్ చౌదరితో సహా ఐదుగురు సిబ్బంది ఇటీవల తమ శిక్షణను పూర్తి చేశారని ఆ అధికారి తెలిపారు. ఇన్‌స్పెక్టర్ చౌదరి, బీఎస్ఎఫ్ వైమానిక విభాగంలో మొదటి మహిళా ఫ్లైట్ ఇంజనీర్ అని ఆయన స్పష్టం చేశారు. ఈ యూనిట్ ఎంఐ17 1వి, ఎంఐ 17 వి5, చీతా, ఏఎల్‌హెచ్ ధ్రువ్ వంటి హెలికాప్టర్‌లతో పాటు, వీఐపీ విధుల కోసం ఫిక్స్‌డ్ వింగ్ ఎంబ్రేయర్ జెట్‌ను కూడా నిర్వహిస్తుంది. సుమారు 3 లక్షల మంది సిబ్బంది ఉన్న బీఎస్ఎఫ్ 1965 డిసెంబర్‌లో ఏర్పాటైంది. అంతర్గత భద్రతలో వివిధ విధులను నిర్వర్తించడంతో పాటు, ఇది ప్రధానంగా భారత్-పాకిస్తాన్, భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల పరిరక్షణ బాధ్యతలను నిర్వర్తించడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

# అడ్లూరి నన్ను టార్గెట్ చేస్తున్నారు: మంత్రి వివేక్

## ఆయనకు టికెట్ ఇప్పించిందే వెంకటస్వామి

## మాలల ఐక్యవేదికలో కార్మిక మంత్రి వివేక్ వ్యాఖ్య

నిజామాబాద్ : తాను మాల జాతికి చెందిన వాడినని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తనను విమర్శిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాలల ఐక్యవేదిక ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ తరఫున జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా తనకు మంచి పేరు వస్తుందని అడ్లూరి లక్ష్మణ్‌కు కుళ్లు అని వ్యాఖ్యానించారు. అక్కడ మొదట కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉండేదని, కానీ తాను ఇన్‌ఛార్జి అయ్యాక ఇప్పుడు సానుకూలంగా మారిందన్నారు. కాకా వెంకటస్వామి జయంతి కార్యక్రమం కార్డులో అడ్లూరి లక్ష్మణ్ పేరు లేదని విమర్శిస్తున్నారని, మంత్రి శ్రీధర్ బాబు తండ్రి జయంతి కార్యక్రమం కార్డులో కూడా ఎవరి పేరు వేయలేదని, కానీ మంత్రి శ్రీధర్ బాబును ఎందుకు విమర్శించడం లేదన్నారు. తననే ఎందుకు విమర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్లూరి వ్యాఖ్యలపై వివేక్ మండిపడ్డారు. లక్ష్మణ్‌కు మొదట కాంగ్రెస్ టికెట్ ఇప్పించిందే కాకా వెంకటస్వామి అని, ఈ విషయం మరిచిపోతున్నారని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తనపై చేసిన వ్యాఖ్యలు నేపథ్యంలో అడ్లూరి తనను లక్షంగా చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని, మాలల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు. రోస్టల్ విధానం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కొందరు మాల జాతిని కించపరిచే విధంగా కుట్రలు పన్నుతున్నారని, వాటిని తిప్పికొట్టాలంటే ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాలల రిజర్వేషన్ పెరిగేలా కృషిచేస్తానని అన్నారు. మాలలు ఐక్యంగా నిలబడి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని అన్నారు. తన తండ్రి జయంతి వేడుకలు జిల్లాలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పిన విధంగా బోధించు, సమీకరించు, పోరాడు అనే సూక్తి ప్రకారం ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సమావేశంలో పాల్గొన్న వర్దన్నపేట ఎంఎల్ఎ నాగరాజు అన్నారు. తాను జిల్లాలో సిపిగా పనిచేసే సమయంలో అందరూ సహకరించారని గుర్తు చేశారు. కాగా, రాజకీయాల్లో కుల వివక్ష కొనసాగుతోందని, దీనిపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రూప్ 1, 2 ర్యాంకులు సాధించిన అభ్యర్థులను సన్మానించారు.

# వ్యవసాయం తర్వాత రియల్ ఎస్టేటే..

'15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని ప్రసంగించారు. 'హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ - మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు... రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి దీటైన సమాధానాలు' అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 'ఈ సెప్టెంబర్ లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం' అని చెప్పారు. 'భారత్ లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జీడీపీలో స్థిరాస్తి రంగ వాటా సగటున 10 శాతం 15 శాతం కాగా... చైనాలో అత్యధికంగా 23 శాతం నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది 6 శాతం నుంచి 8 శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ %-% 2, భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఏఐ సిటీకి రెండు, మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె.శ్రీధర్ రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం జేఏసీ ఏర్పాటు... చైర్మన్ గా ఆర్.కృష్ణయ్య

తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీ) హక్కుల సాధన ఉద్యమం కొత్త రూపు సంతరించుకుంది. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లను సాధించడమే ఏకైక లక్ష్యంగా బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి 'తెలంగాణ బీసీ జేఏసీ' (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేశాయి. ఈ ఐక్య కార్యాచరణ కమిటీకి చైర్మన్‌గా సీనియర్ నేత ఆర్. కృష్ణయ్య, వైస్ చైర్మన్‌గా వీజీ నారగోని ఏకగ్రీవంగా నియమితులయ్యారు. వీరితో పాటు మరో ఆరుగురు కీలక సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లపై కోర్టు ఏ కారణంతో స్టే ఇచ్చిందో స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడ్డారు. బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈ నెల 18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు ఆయన పిలుపునిచ్చారు. "గత 76 ఏళ్లుగా బీసీలు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పుడు దానికి అవమానం కూడా తోడైంది. మా హక్కుల కోసం చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టే వరకు ఈ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదు" అని ఆర్. కృష్ణయ్య స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యమం బలంగా జరిగితే కేంద్ర ప్రభుత్వంపై కూడా ఒత్తిడి పెరుగుతుందని ఆయన అన్నారు. బీసీ సమాజం ఐక్యంగా నిలబడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. నేటి నుంచే నామినేషన్లు

అభ్యర్థితో పాటు కేవలం నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించనున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే 18 మార్గాల్లో ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెంచారు. మరోవైపు, ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ తరఫున మాగంటి సునీత పేరును ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ కుమార్ బరిలో నిలవనున్నారు. బీజేపీ అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నామినేషన్లు వేయడానికి పది రోజుల సమయం ఉండటంతో, అభ్యర్థులు మంచి ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నారు. పశ్చిమ మండలం డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 9 మంది ఎస్ఐలతో పాటు 59 మంది సిబ్బంది, రెండు ప్లాటూన్ల బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు ఈ భద్రతా వలయం కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

## ఎస్సారెస్పీ స్టేజ్-2కు ఆర్డీఆర్ పేరు

రేవంత్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులతో కలిసి హాజరయ్యారు.

**గోదావరి జలాల కోసం పోరాటం**

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు నీళ్లు ఇచ్చారని, నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు తేవడానికి దామోదర్‌రెడ్డి ఎనలేని పోరాటం చేశారని రేవంత్‌రెడ్డి చెప్పారు. అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని తీసుకొచ్చి రక్తతర్పణం చేశారని గుర్తుచేశారు. ఐదుసార్లు శాసన సభ్యుడిగా, రెండుసార్లు మంత్రిగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, జెండా మోసిన కార్యకర్తలకు అండగా నిలిచారని కొనియాడారు. ఖమ్మం జిల్లాలో రాంరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ జిల్లాలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి జోడెడ్లలాగా పార్టీని తమ భుజాలపై మోసినట్లు పేర్కొన్నారు. గాంధీ కుటుంబం దామోదర్‌రెడ్డి కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్‌లో దామోదర్‌రెడ్డి కుటుంబానికి రాజకీయంగా అవకాశాలు కల్పించి కాపాడుకుంటామని రేవంత్‌రెడ్డి చెప్పారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జునఖర్గేకు దామోదర్‌రెడ్డిపై అభిమానం ఉందన్నారు. రాహుల్‌గాంధీ తన సంతాపాన్ని స్వయంగా లేఖ ద్వారా రాంరెడ్డి సర్వోత్తంరెడ్డికి పంపారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రాంచందర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ప్రభుత్వ వీప్ బీర్ల ఐలయ్య, మాజీ మంత్రి జానారెడ్డి, మాజీ ఎంపీ హన్మంతరావు, ఎమ్మెల్యేలు మందుల సామేలు, పద్మావతి, వేముల వీరేశం, బాలునాయక్, మట్టా రాఘమయి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి ఖరారు

అందులో ఒక పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ప్రధానంగా పోటీలో ఉన్న దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలతల్లో ఒకరి పేరును ఖరారుచేసినట్లు తెలుస్తోంది. బిహార్ సహా జూబ్లీహిల్స్ అభ్యర్థిత్వాలపై చర్చించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన కమిటీ ఆదివారం సమావేశమైంది. ఈ భేటీకి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలకు సంబంధించి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఇప్పటికే అధిష్టానం పెద్దలకు నివేదిక అందించారు. దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలతల పేర్లతోనే ఆ నివేదిక అందింది. కమిటీ దీపక్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నట్లు చెబుతున్నారు. అభ్యర్థిని సోమవారం ప్రకటించే అవకాశం ఉందని కె.లక్ష్మణ్ చెప్పారు.

## మహాఘట్‌బంధన్ సంయుక్త మేనిఫెస్టో

అడుగులు వేస్తున్నాయి. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్, ఆర్జేడీ ముఖ్య నేతల మధ్య కీలక భేటీ ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. త్వరలోనే సీట్ల పంపకాన్ని ఖరారుచేసి ఈ వారంలోనే సంయుక్త మేనిఫెస్టోను ప్రకటించాలని విపక్ష కూటమి భావిస్తోంది. నేడు జరగబోయే సమావేశం కోసం ఇప్పటికే ఆర్జేడీ అగ్రనేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్‌లు ఢిల్లీకి చేరుకున్నారు. భేటీ కోసం వచ్చానని లాలూ చెప్పగా కోర్టు కేసు కోసం వచ్చానని తేజస్వీ ఎయిర్‌పోర్ట్‌లో మీడియాతో చెప్పారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో పేలవ ప్రదర్శన నేపథ్యంలో ఈసారి కాంగ్రెస్ తక్కువ సీట్లనే కోరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆనాడు 70 చోట్ల పోటీచేసి 17 చోట్ల మాత్రమే కాంగ్రెస్ గెల్చిన విషయం తెల్సిందే. కాంగ్రెస్ గౌరవప్రదమైన ఆమోదనీయమైన స్థానాలను సాధించవచ్చని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు.

## ప్రధాని మోదీకి ట్రంప్ ఆహ్వానం!



మోదీకి ఆహ్వానం పంపించారు. మరోవైపు.. ఈజిప్టు అధ్యక్షుడు అబ్దేల్ ఫత్తా అల్-సిసి సైతం మోదీని ఆహ్వానించినట్లు సమాచారం. చివరి నిమిషంలో ప్రధాని మోదీకి ఈ ఆహ్వానం అందినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే.. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. మోదీ హాజరుపై ప్రకటన వెలువడాల్సి ఉంది.

**ఇరు పక్షాల అంగీకారం..**

ఇదిలా ఉండగా.. ఆకలి చావులతో రెండేళ్లుగా అల్లాడిపోతున్న కల్లోలిత గాజాలో శాంతి సాధనకు అడుగులుపడిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికలో మొదటి దశను వైరిపక్షాలైన ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఈ మేరకు ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేయబోతున్నాయి. రెండేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం పూర్తిగా ముగింపునకు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి దశ ఒప్పందం ప్రకారం.. గాజాలో దాడులు వెంటనే ఆపేయాలి. తమ చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీలను అతిత్వరలో హమాస్ మిలిటెంట్లు విడుదల చేయనున్నారు. అందుకు బదులుగా తమ నిర్బంధంలో ఉన్న పాలస్తీనా ఖైదీలకు ఇజ్రాయెల్ ప్రభుత్వం విముక్తి కల్పించనుంది. అలాగే గాజా నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లిపోనుంది.

**రెండు కీలకమైన అంశాలపై రాని స్పష్టత..**

హమాస్ అధీనంలో 20 మంది బందీలు సజీవంగా ఉన్నట్లు అంచనా. భగవంతుడి దయతో వారందరినీ స్వదేశానికి తీసుకొస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. హమాస్ సైతం స్పందించింది. ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ సేనలు వెనక్కి వెళ్లిపోవాలని, గాజాలోకి మానవతా సాయాన్ని ఇజ్రాయెల్ ప్రభుత్వం అనుమతించాలని పేర్కొంది. ఇజ్రాయెల్ బందీలను విడుదల చేస్తామని వెల్లడించింది. అందుకు బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఖైదీలను తమకు అప్పగించాలని తేల్చిచెప్పింది. మరోవైపు రెండు కీలకమైన అంశాలపై స్పష్టత రాలేదు. ట్రంప్ ప్లాన్ ప్రకారం హమాస్ మిలిటెంట్లు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి. గాజా పరిపాలన బాధ్యతలను నిపుణులతో కూడిన స్వతంత్ర పాలస్తీనా అథారిటీకి అప్పగించాలి. ఈ రెండింటిపై హమాస్ గానీ, ఇజ్రాయెల్ గానీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.





# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయం, తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తథ్యం : ఎంపీ వద్దిరాజు

జూబ్లీహిల్స్ : కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యంగా బీసీలు చాలా కోపంతో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు.కాంగ్రెస్ నాయకులు హామీలెన్నో ఇచ్చి ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు,ఆటో కార్మికులు, ఉద్యోగులు,వ్యాపారులు ప్రభుత్వంపై మండిపడుతున్నారని చెప్పారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీకి జరుగుతున్న ఉప ఎన్నిక నేపథ్యంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు యూసఫ్ గూడ డివిజన్ బాధ్యతలను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ముఖ్య కార్యకర్తలతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేశారు.ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆశీస్ కుమార్ యాదవ్, మంగళారపు లక్ష్మణ్ తదితర ప్రముఖులు పోలింగ్ స్టేషన్ల వారీగా కార్యకర్తలకు ఓటర్ల జాబితాలను అందజేసి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు.రిజర్వేషన్స్ పెంపుదల పేరిట బీసీలను నమ్మించి మోసం చేశారని, ద్రోహం తలపెట్టారని కాంగ్రెస్ పాలకుల వైఖరిని నిశితంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీసీల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి పడవని, హైదరాబాద్ నగరాన్ని గొప్పగా అభివృద్ధి చేసిన, తెలంగాణను బంగారుమయంగా తీర్చిదిద్దిన కేసీఆర్ వైపు ప్రజలు చూస్తున్నారన్నారు.తమకు బీఆర్ఎస్ పార్టీనే దిక్కు, కేసీఆరే తెలంగాణ జాతిపిత,దిక్సూచి అని అన్ని వర్గాల ప్రజలు భావిస్తున్నారని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఘన విజయం సాధించి గులాబీ జెండా ఎగరడం ఖాయమని,వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ వద్దిరాజు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పుస్తె శ్రీకాంత్,వాసాల వెంకటేష్, మంగళవారం లక్ష్మణ్,గుండ్లపల్లి శేషగిరిరావు, జెన్నాయికోడే జగన్మోహన్,పర్వతం సతీష్,కోట్ల వినోద్ కుమార్,పవన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## మా కూతుర్ని కాపాడండి ప్లీజ్..

**పునర్జన్మ ప్రసాదించండి.. ప్రగ్య శ్రీ బ్రతికుంటే చాలు..**

**చేతులు చాచి ప్రభుత్వం, సమాజం వైపు చూస్తున్న తల్లిదండ్రులు**



శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (వాయిస్ టుడే): పిల్లలు సంతోషంగా ఉండాలని, గొప్ప చదువులు అభ్యసించి, తమ పిల్లలను ఉన్నత స్థానాల్లో చూడాలని ప్రతి తల్లిదండ్రులు ఆశ పడి ఎంతటి కష్టాన్నయినా భరిస్తూ పిల్లల భవిష్యత్తు కోసమే కదా, అని ఆనంద పడుతూ ఉంటారు. కానీ అలాంటి అదృష్టం రామచంద్రపురం బీరంగూడకు చెందిన సత్యనారాయణ, పుష్పలత దంపతులకు దక్కలేదు. మా కూతురు బ్రతికి ఉంటే చాలు అంటూ చేతులు చాచి ప్రభుత్వం, సమాజం వైపు చూస్తున్న సంఘటన హృదయాన్ని కలిచివేస్తోంది. సత్యనారాయణ, పుష్పలత దంపతులకు ఇద్దరు పిల్లలు (పాప,బాబు). భార్య పుష్పలత(గృహిణి), ఇద్దరు పిల్లలను సత్యనారాయణ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందరిలాగే సంతోషంగా ఉన్నా ఆ కుటుంబం లో కూతురు ప్రగ్య శ్రీ (19) అనారోగ్యం కారణంగా అతలాకుతలంగా మారిపోయింది. ఇంటర్మీడియట్ డిస్ కంటిన్యూ చేసిన ప్రగ్య శ్రీ, గత మూడేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. అప్పటినుండి డయాలసిస్ ద్వారా చికిత్స పొందుతోంది. ఉన్నవన్నీ అమ్మి, స్నేహితులు, బంధుమిత్రుల దగ్గర అప్పులు చేసి, బ్యాంకు లోన్ ల ద్వారా పొందిన డబ్బును ఇప్పటి వరకు ప్రగ్య శ్రీ వైద్యానికి రూ. 30 లక్షలు ఖర్చుపెట్టిన ఫలితం లేకుండా పోయిందని ప్రగ్య శ్రీ తల్లితండ్రులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రగ్య శ్రీ రెండు కిడ్నీలు పూర్తిగా ఫెయిల్ అయ్యాయని, త్వరితగతిన కిడ్నీల మార్పిడి చేయకపోతే ప్రాణాపాయం ఉందని డాక్టర్లు తెలిపారు. అయితే పాడైపోయిన రెండు కిడ్నీలను తీసి వేరే కిడ్నీలను అమరచడానికి దాదాపుగా 25 లక్షలు రూపాయలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో దిక్కు తోచని స్థితిలో ఆ కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రగ్య శ్రీ, నీ కూతురిలా, సోదరిలా, స్నేహితురాలిగా భావించి ఆరోగ్యమైన జీవితాన్ని తిరిగి పొంది తన చదువును యధావిధిగా కొనసాగించడానికి అందరూ తోడ్పడాలని సమాజాన్ని కోరుతున్నారు.

**ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాము, మా కూతురుకి పునర్జన్మ ప్రసాదించండి..**

ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న తమ కుటుంబాన్ని ఆదుకోని.... తమ కూతురుకి పునర్జన్మనివ్వాలని ఆ దంపతులు దాతలు ఎవరైనా తమకు తోచినంత సహాయం చేసి తమ కూతురు ని కాపాడాలని వేడుకుంటోంది. ఆ కుటుంబం సమాజ భరోసా కోసం ఎదురుచూస్తోంది. 9494242655.. నెంబర్ కు గూగుల్ పే, ఫోన్ పే గాని చేయాలనీ ప్రగ్యా శ్రీ తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**అమ్మతనం అంటే ఇదేనేమో! పుష్పలత(అమ్మ) మీకు సలాం..**

తన పిల్లల కాలుకు చిన్న ముళ్ళు గుచ్చుకుంటేనే తల్లడిల్లి పోయే అమ్మ, చేతికొచ్చిన కూతురు ప్రాణాపాయ స్థితిలో ఉంటే ఆ కన్నతల్లి పరిస్థితి వర్ణించలేనిది. కూతురు ప్రగ్యశ్రీ కోసం తన కిడ్నీని ఇవ్వడానికి సిద్ధపడింది. అయితే పుష్పలత తన కిడ్నీ ఇవ్వటానికి వైద్య పరంగా అన్ని విధాలుగా సహకరించినప్పటికీ, ఆర్థిక పరిస్థితులు మాత్రం కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం సహకరించడం లేదు. అందరూ పెద్ద మనసుతో స్పందించి తన కూతురి ప్రణాలను కాపాడి తన జీవితంలో వెలుగులు నింపాలని పుష్పలత వేడుకుంటుంది.



## బూత్ స్థాయి ప్రచారమే బిఆర్ఎస్ విజయానికి మూలం

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

జూబ్లీహిల్స్, 12 అక్టోబర్ (వాయిస్ టుడే) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం రోజున బోరబండ డివిజన్లో నిర్వహించిన బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశానికి బోరబండ డివిజన్ ఎన్నికల ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ , ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఆలేరు మాజీ శాసనసభ్యులు - మాజీ ప్రభుత్వ గొంగడి సునీతా , బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొమ్మ రామ్మూర్తి ముఖ్య అతిథులుగా హాజరై బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గారి క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన చర్యలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతీ కార్యకర్త క్షేత్ర స్థాయిలో తిరుగుతూ గత 12 ఏళ్ల కాలంలో వేలకోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గంలో మాగంటి గోపీనాథ్ చేపట్టిన సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ అభివృద్ధిలో నాయకులు, కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని, బూత్ స్థాయి ప్రచారమే బిఆర్ఎస్ విజయానికి మూలమని అన్నారు.ఈ సమావేశంలో కో-ఆర్డినేటర్లు, ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.



## రాంరెడ్డి దామోదర్ రెడ్డి దశదిన కర్మలో పాల్గొన్న మందముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- మాజీ మంత్రివర్యులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి లు ఉన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ స్వర్గీయ రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

# నిరంతరం ప్రజా సమస్యల పరిష్కానికి కృషి

**కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ**




కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, కాలనీ సభ్యులు, నాయకులు పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు వారు సానుకూలంగా స్పందించారు. వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టి అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యే కె.పి వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు..

తెలంగాణ స్టేట్ రోలర్ స్కేటింగ్ వారు నిన్న సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలో విజేతగా నిలిచిన మల్లంపేట్ కె.వి.ఆర్ వ్యాలీ నివాసులు జొన్నల తన్విష్ తేజ్ వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారినీ అభినందించారు, క్రీడా పోటీల్లో రాణించాలని తెలియజేశారు. అనంతరం ఇటీవల విజయవాడలో బోధిధర్మ వారు నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచిన బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ నివాసులు కొర్ర రాము వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారినీ అభినందించారు, క్రీడా పోటీల్లో రాణించాలని తెలియజేశారు.

## పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కల పల్స్ పోలియో

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(వాయిస్ టుడే): 132 - జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన "పల్స్ పోలియో" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....పిల్లల నిండైన జీవితానికి రెండు చుక్కలు పల్స్ పోలియో తల్లిదండ్రులు విధిగా వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, స్థానిక బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

**నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12( వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుందిగల్ మున్సిపాలిటీ బహదురుపల్లి పరిధిలోని వినాయకనగర్ వాసులు మొహమ్మద్ నబి రసూల్ అన్సారీ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 100,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 100000/- ( ఒక లక్షల రూపాయలు ) సీఎంఆర్ఎఫ్ - ఎల్ ఓ సి మంజూరి పత్రాలను ఎండీ నబి రసూల్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్ ,సిద్దనోల సంజీవ రెడ్డి, ఎన్ ఎం సి అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, దుడ్డు రాహుల్,సలీమ్ తదితరులు పాల్గొన్నారు.



## మైనారిటీ యువతి చికిత్స కోసం సిఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం చేసిన బొంగునూరి కిషోర్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చిగా గిల్లాపూర్ గ్రామంలో నివసిస్తున్న మైనారిటీ యువతికి ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టి న సమస్య (బ్లడ్ క్లాట్) తలెత్తింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్యం అందించడం కష్టంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి తక్షణమే స్పందించారు. బాధిత యువతికి సిఎంఆర్ఎఫ్ ( ఎల్. ఓ. సి) ద్వారా అవసరమైన వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.సర్జరీ విజయవంతంగా పూర్తయ్యి, యువతి ప్రస్తుతం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవడంతో, కిషోర్ రెడ్డి స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ధైర్యం చెప్పడంతో పాటు, 10,000 ఆర్థిక సహాయం కూడా అందించారు. ప్రజల బాధలో భాగస్వాములవుతున్న ఆయన ఉదారత, సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఉమ్మడి ఖుత్బుల్లాపూర్ మండల సర్పంచ్ ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ శ్రీశైలం ముదిరాజ్, దొంతి మహేష్ ముదిరాజ్, క్రిష్ణ మహేష్ పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు

**పోలియో చుక్కల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజక వార్గం 125డివిజన్ గాజులరామారం పరిధిలోని ఖైసర్ నగర్ డబల్ బెడ్ రూమ్ సొసైటీ లో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి లి హాజరై పిల్లలకు అందిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ తల్లితండ్రులందరు బాధ్యతగా తీసుకుని ఐదు ఏళ్ల వయస్సు లోపు ఉన్న పిల్లలకు విధిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పోలియో వ్యాధికి టీకా తప్ప మరోక పరిష్కరం లేదు కాబట్టి పిల్లల ఆరోగ్యం విషయంలో అశ్రద్ద వహించకుండా తప్పనిసరిగా పోలియో డ్రాప్స్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్దనోల సంజీవ రెడ్డి ,బహదురుపల్లి మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్,యాదగిరి ,శామీర్ షఫీ ,శ్రీనివాస్,ఫారీన్ ఖాన్ పాల్గొన్నారు.




## లయన్స్ క్లబ్, హెూప్ ఫౌండేషన్ సేవలు అద్భుతం

### స్టేట్ బ్యాంక్ ఏజీఎం, మర్రి భాస్కర్

### పల్స్ పోలియో వాలంటరీలకు భోజనాలు అందచేత

శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (వాయిస్ టుడే): పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి ఆరోగ్య కేంద్ర పరిధిలో వాలంటీర్లుగా పనిచేస్తున్న 700 వాలంటరీలకు లయన్ క్లబ్ ఆఫ్ హెూప్, హెూప్ ఫౌండేషన్ ఉదయం టిఫిన్స్ తో పాటు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మర్రి భాస్కర్ , హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తో కలిసి భోజనాలను అందచేశారు. హెూప్ ఫౌండేషన్ ద్వారా వాలంటీర్లకు భోజన సదుపాయాలు కల్పించడం పట్ల కొండ విజయ్ కుమార్ ని అభినందించారు. శేరిలింగంపల్లి పరిధిలో 133 కేంద్రాలకు భోజనాలను అందించడం పట్ల వైద్య అధికారులు ప్రత్యేక ధన్యవాదాలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు బర్క మల్లేష్ యాదవ్, మారం ప్రసాద్, సింఘదాసరి రాజశేఖర్, వడ్ల విష్ణు మూర్తి, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



## జ్యోతి సేవా సంస్థ చేసే సేవలు అభినందనీయం

### నలుగురుతో ఏర్పడి 45 మందికి చేరుకున్న జ్యోతి సేవా సంస్థ

### 84వ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న జ్యోతి సేవా సంస్థ

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 12 ( వాయిస్ టుడే) : హైదరాబాద్ నగరంలోని సనత్ నగర్ లో గల ఆస్బెస్టాస్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహించి సమాజానికి ఏదో ఒక మంచి చేయాలని ఆలోచనతో సుబ్రహ్మణ్యం, దయానంద్, సత్యనారాయణ, హనుమంతరావు లు జ్యోతి సేవా సంస్థను ఎన్నుకొని నిరుపేదలకు సేవలను అందించేందుకు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో 2004 జనవరి 26 న ప్రారంభించిన జ్యోతి సేవా సంస్థ ఈనాటికి 21 సంవత్సరాలు నిర్విఘ్నంగా సేవలందించారు. అదే కంపెనీలో విధులు నిర్వహించిన 15 మందిని వారి బోర్డు మెంబర్స్ గా చేర్చుకొని ప్రతినెల ప్రతి ఒక్కరూ 50 రూపాయల చొప్పున జమచేసి సంవత్సరానికి కొన్ని కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రస్తుతం 45 మందితో ఈ జ్యోతి సేవా సంస్థ కొనసాగుతుంది. ఈ తరుణంలో ఆదివారం ముషీరాబాద్ బస్టాండ్ వెనకాల గల నైటింగేల్ గర్ల్స్ హెూమ్ లో సుమారు వందమందికి ఉచిత భోజనాన్ని అందించారు. జ్యోతి సేవా సంస్థల గా ప్రతి ఒక్కరు విధిగా చుట్టుపక్కల వారికి, నిరుపేదలకు యువత ముందుకు రావాలని జ్యోతి సేవా సంస్థ పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో తమకు తోచినంత సహాయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని, ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతామని జ్యోతి సేవా సంస్థఅధినేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జ్యోతి సేవ సంస్థ నిర్వాహకులు సాయి కిషోర్, దాస్, ఉమా ప్రసాద్, నరసింహ, వెంకట్రావు, నారాయణ, బాల్రాజ్, ప్రకాష్ , మురళి తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- ఉప్పల్ డివిజన్ శాంతి నగర్ కమ్యూనిటీ హాల్ లో నిర్వహించిన పల్స్ పోలియో పలు కాలనీ లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సందర్శించి కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 5సంవత్సరాల లోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పకుండ రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. తద్వారా పోలియోను అంతమొందించి పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దామని ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎస్ సి సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ,సల్ల ప్రభాకర్ రెడ్డి,జనరల్ సెక్రటరీ తుమ్మల దేవి రెడ్డి,అల్వాల భాస్కర్,కట్టపల్లి విజయ్ కుమార్ గుప్తా,జనగాం రామకృష్ణ, అలుగుల అనిల్ కుమార్, కుషాంగల సతీష్,సతీష్,మహిళ నాయకులు రూతమ్మ,మహిళ అధ్యక్షులు రేణుక, కవిత ,నతదితరులు పాల్గొన్నారు.



## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ సిఎన్ రెడ్డి గారిని వారి నివాసంలో కలిశారు. రానున్న ఉపఎన్నికలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సహకారం అందించాలని సీఎన్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి గ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి, విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

# గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ గ్రేస్






శేరిలింగంపల్లి, అక్టోబర్ 12(వాయిస్ టుడే): గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి స్టేడియం లో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ గ్రేస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం స్క్రీన్ ఫర్ లైఫ్ అనే థీమ్ తో నిర్వహించిన గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్( 10కే, 5కే, 2కే) ఎనిమిదో ఎడిషన్ ను మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్ రావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తో కలిసి పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ లక్షలాది మందిని కబళిస్తున్న కాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన సామాజిక బాధ్యత మనందరి పై ఉందన్నారు. “ఆరోగ్య తెలంగాణ” ను నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. సమాజంలో క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు “గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్” చేస్తున్న కృషి అభినందనీయమని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10కే, 5కే , 2కే రన్ నిర్వహించడం చాలా అభినందనియం అని, ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పై విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరి పై ఉంది అని , నేటి ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరం అని గుర్తు చేయడం ఈ రన్ ఎంతగానో తోడ్పడుతుంది అని ఎంతో మందికి స్ఫూర్తి గా నిలుస్తుంది అని , వృద్ధులు ,యువత , చిన్న పిల్లలు పాల్గొనడం ఎంతో ఆనందయాకం అని , ప్రతి ఒక్కరు ఆరోగ్యము పట్ల ఎంతో శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వలన మానసిక ఉల్లాసం ,ప్రశాంతత చేకూరుతుంది అని, మారిన జీవన శైలి లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వ్యాయమం చేయాలని, ఈ రన్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అని ,ఇది ఒక మంచి శుభపరిణామం అని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. చినబాబు సుంకవల్లి మరియు తదితరులు పాల్గొన్నారు.



## వెస్ట్ బెంగాల్ జే.ఎం.ఎస్ నేతలకు తెలంగాణ రాష్ట్ర జే.ఎం.ఎస్ అధ్యక్షుడు సురేందర్ సత్కారం



శేరిలింగంపల్లి, అక్టోబర్ 12 (వాయిస్ టుడే): హైదరాబాద్ నగరంలో జరిగిన ఒక సమావేశానికి హాజరైన వెస్ట్ బెంగాల్ లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) లేబర్ సెల్ జనశక్తి మజ్దూర్ సభ చీఫ్ జనరల్ సెక్రెటరీ తపన్ బర్మన్, ప్రధాన కార్యదర్శి శాంతను మొన్డల్ లను తెలంగాణ రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సభ అధ్యక్షుడు సురేందర్ ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా భీహెచ్ఈఎల్ లో ఉన్న తెలంగాణ రాష్ట్ర జనశక్తి మజ్దూర్ సబ అధ్యక్షులు సురేందర్ ను కలవడానికి వచ్చిన సంధర్భంగా స్నేహపూర్వకంగా వారిని ఆహ్వానించారు. అనంతరం వారు తెలంగాణ రాష్ట్రంలో పర్మనెంట్ కార్మికులు మరియు కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పైన, జనశక్తి మజ్దూర్ సభ కార్యక్రమాల పైన ఇరువురు చర్చించుకున్నారు. బీహార్ ఎన్నికల అనంతరం జనశక్తి మజ్దూర్ సభ జాతీయ సమావేశాలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయని అని సురేందర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు రావడం ఆనందంగా ఉందని వెస్ట్ బెంగాల్ నేతలు ఆనందం వ్యక్తం చేశారు.



## ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చిన్నారి రేయాన్ చక్రవర్తికి తన ఆశీస్సులు అందజేశారు.సూర్యాపేటకు చెందిన రాజకీయ ప్రముఖులు,మున్నూరుకాపు సంఘం నాయకులు పెద్దిరెడ్డి రాజా-భారతిల మనవడు, పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి -లత దంపతుల కుమారుడు రేయాన్ చక్రవర్తి నూతన పట్టు వస్త్రాలంకరణ (పంచెల వేడుక)వేడుక సాయిబాబా ఆలయం సమీపాన రవి మహల్ ఫంక్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది.ఈ వేడుకకు ఎంపీ రవిచంద్ర హాజరై అక్షింతలు వేసి రేయాన్ చక్రవర్తిని ఆశీర్వదించారు.ఈ వేడుకకు మున్నూరుకాపు సంఘం నాయకులు గాలి శ్రీనివాస్,పిట్టల వెంకన్న,ఉద్యోగుల సంఘం నాయకులు పందిరి వెంకటేశ్వర మూర్తి తదితర ప్రముఖులు హాజరై రేయాన్ చక్రవర్తికి తమ ఆశీస్సులు అందజేశారు.



## భారతీయుల వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరిక



జూబ్లీహిల్స్ 12 అక్టోబర్ (వాయిస్ టుడే) ఎర్రగడ్డ డివిజన్ నుండి పొన్నం ప్రభాకర్ మరియు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్తగా పార్టీలో చేరిన సభ్యులను ఆహ్వానించి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ కలసి కృషి చేయాలని పిలుపునిచ్చారు..నవీన్ యాదవ్ మాట్లాడుతూ, ఉత్తర భారతీయుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని, జూబ్లీహిల్స్ లో అందరికీ సమాన హక్కులు, అభివృద్ధి అవకాశాలు కల్పించడం తమ లక్ష్యమని పేర్కొన్నారు.బిలిఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉత్తర భారతీయుల సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చిన్నారులకు నిండు జీవితానికి రెండు చుక్కలు ప్రధానం

### టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్

కూకట్ పల్లి, అక్టోబర్ 12(వాయిస్ టుడే): తెలంగాణలో పోలియో తిరిగి రాకుండా చూసేందుకు ఆదివారం అక్టోబర్ 12న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ సహా ఆరు జిల్లాల్లో ప్రత్యేక పల్స్ పోలియో టీకా కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి లోని రాందేవ్ రావు హాస్పిటల్ ఏర్పాటు చేసిన శిబిరంలో టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో కేసులు నమోదవుతున్న పొరుగు దేశాల నుంచి రాకపోకలు ఉన్నందున.. ఐదేళ్ల లోపు ఉన్న దాదాపు 17.5 లక్షల మంది పిల్లలకు టీకాలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, ఏ ఎమ్ సి వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, డాక్టర్ కల్పన తదితరులు పాల్గొన్నారు.



## ఆర్ఎస్ఎస్ కవాతులో బండి సంజయ్

### కరీంనగర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా ప్రారంభమైన బండి సంజయ్ జీవితం

### ఆర్ఎస్ఎస్ వస్త్రధారణతో ఆకట్టుకున్న కేంద్ర మంత్రి

కరీంనగర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే): కరీంనగర్ పట్టణంలో రాష్ట్రీయ సేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ స్వయం సేవకులు భారీ కవాతు ప్రదర్శన చేపట్టారు.శాతవాహన యూనివర్సిటీ రోడ్ లోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నుండి కరీంనగర్ పట్టణంలో పలు ప్రాంతాల మీదుగా రాంనగర్ వరకు రూట్ మార్చ్ ( పథ సంచలన్)కార్యక్రమం కొనసాగింది.అనంతరం శ్రీ చైతన్య జూనియర్ కళాశాల మైదానంలో సంచలన్ సమరోప్ (ముగింపు సమావేశం) జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య వక్త గా విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యదర్శి అయ చితుల లక్ష్మణరావు హాజరయ్యారు.ఈ కవాతు సందర్భంగా అందరి దృష్టి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పైనే పడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ డ్రెస్ ధరించి ఈ కవాతులో పాల్గొన్నారు. స్వయం సేవకులతో కలిసి చైతన్య కాలేజీ వరకు కవాతు చేశారు.బండి సంజయ్ చిన్నప్పుడు కరీంనగర్ లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగానే జీవితాన్ని ప్రారంభించారు. చదువుకునే సమయంలో కరీంనగర్ రాంనగర్ బస్తీలో ముఖ్య శిక్షక్ గా కొనసాగారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల కవాతు సందర్భంగా కరీంనగర్ రాంనగర్ సత్యనారాయణ స్వామి టెంపుల్ వద్దకు వచ్చిన కేంద్ర మంత్రి ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్ లో పాల్గొన్నారు.మరోవైపు పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థులు,స్థానిక ప్రజలు సైతం ఆర్ఎస్ఎస్ కవాతును ఆసక్తిగా తిలకించడంతోపాటు కవాతుపై పూల వర్షం కురిపిస్తూ తమ మద్దతును తెలియజేశారు.మరోవైపు బండి సంజయ్ తోపాటు ఆయన కుమారుడు బండి సాయి సుముఖ్ సైతం ఆర్ఎస్ఎస్ కవాతులో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. ఆర్ఎస్ఎస్ కవాతు ముగిసిన అనంతరం నిర్వహించిన సమరోప్ కార్యక్రమంలోనూ బండి సంజయ్ పాల్గొన్నారు.



## రామగుండం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ స్థాపన దిశగా తొలి అడుగు

### పెద్దపల్లి ప్రజలకు శుభవార్త, ఎంపీ గడ్డం వంశి కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

### బాణసంచాలతో సంబరాలు కాంగ్రెస్ పార్టీ నాయకులు

### పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణకి ధన్యవాదాలు

పెద్దపల్లి జిల్లా: అక్టోబర్. 12 (వాయిస్ టుడే) గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు అధికారికంగా ?40.53 లక్షలు మంజూరు చేసి, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI)కు ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ ఫీజు చెల్లించింది. ఇది రామగుండం ఎయిర్‌పోర్ట్ స్థాపన దిశగా ఒక చారిత్రాత్మక ముందడుగు రాష్ట్ర రవాణా, రోడ్లు మరియు భవనాల శాఖ (TR&B) ఈ ఆదేశాలు జారీ చేసింది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలో 591 ఎకరాల భూమి పై గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు ప్రతిపాదనపై ఈ స్టడీ జరగనుంది.

గత రెండు సంవత్సరాలుగా మనం కోరుకున్న రామగుండం ఎయిర్‌పోర్ట్ కల ఇప్పుడు సాకారం అవుతోంది. ఈ ఎయిర్‌పోర్ట్ ద్వారా మన పెద్దపల్లి పార్లమెంట్ ప్రజలకు, సింగరేణి సిబ్బందికి, విద్యార్థులకు, వ్యాపార వర్గాలకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుంది. హైదరాబాద్‌కి గంటల కొద్దీ ప్రయాణం చేసే అవసరం లేకుండా ప్రత్యక్ష కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇది మన ప్రాంతానికి నూతన ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను తెస్తుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ,.. ఈ అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాను. ప్రీ-ఫిజిబిలిటీ స్టడీ పూర్తయిన తరువాత, సెంటర్ ఫిజిబిలిటీ స్టడీ చేపడుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రఫీక్.వాసర్ల సురేందర్ హకీమ్.తిపర్పు మధు. నరేందర్ రెడ్డి. జవీద్.చారి. కిషోర్.మధు. మహేష్. శ్రీను. విజయ్. శేఖర్. పెద్ద సఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితీరులు పాల్గొన్నారు.



## శరీర దానమునకు అంగీకరించిన సాంబారి స్వరూప

### – అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు

జమ్మికుంట అక్టోబర్ 12 (వాయిస్ టుడే): ఆబాది జమ్మికుంట రాధాస్వామి సత్సంగము సభ్యురాలు అయిన భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం లింగాల గ్రామ నివాసి సాంబారి స్వరూప(52) తన మరణానంతరము తన శరీరాన్ని కాకతీయ మెడికల్ కాలేజీ వరంగల్ కు దానం చేయుటకు అంగీకార పత్రము సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులకు ఇవ్వనైనది. శరీరధాత సాంబారి స్వరూప కి సదాశయఫౌండేషన్ అభినందన పత్రము ఇవ్వనైనది. ఇట్టి కార్యక్రమం సదాశయ ఫౌండేషన్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు గర్రెపల్లి వెంకటేశ్వర్లు, వంగల రమేష్, మరియు ఆబాది జమ్మికుంట రాధాస్వామి సత్సంగం నిర్వాహకుడు మద్దెర్ల సారంగపాణి పాల్గొని శరీరధాతకు అభినందనలు తెలిపినారు.

# కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముమ్మర చర్యలు

### వరి మద్దతు ధర పెంపు

### ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి వెల్లడి



తిమ్మాపూర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే): రైతులకు మద్దతు ధర అందించడంతోపాటు ధాన్యం అమ్మకాల విషయంలో ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకుంటు న్నదని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.బెజ్జంకి మండలంలోని రేగులపల్లి,గుగ్గిళ్ల, గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలను విరివిగా ఏర్పాటు చేస్తున్నదని పేర్కొన్నారు.గతంలో కంటే ఎక్కువగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు.గత సీజన్‌లో కంటే ప్రస్తుత యేడాది మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని ఆయన చెప్పారు.ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389కి తోడుగా క్వింటాలుకు రూ.500 బోనస్, సాధారణ బీ గ్రేడ్ రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించిందన్నారు.గత యేడాది కంటే ఈసారి అదనంగా మద్దతు ధర పెరిగిందని చెప్పారు. రైతులు ధాన్యం బాగా ఆరబోసి కేంద్రాలకు తీసుకొస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు.రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకు వచ్చి కనీస మద్దతు ధరను పొందాలన్నారు.17 శాతం కంటే తక్కువ తేమ ఉండే విధంగా రైతులు చూసుకోవాలని ఆయన సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఆయన సూచించారు.తూకం విషయంలో తేడాలు ఉండకూ డదన్నారు.సన్న రకం వరి ధాన్యం పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500 బోనస్ అందిస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచిత కరెంట్,రుణ మాఫీ, రైతు భరోసా అందిస్తున్నదన్నారు.తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ సుధీర్,ఏపీవో పర్షరాములు,బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,మండల పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు గూడెల్లి శ్రీకాంత్,బైర సంతోష్,లింగం,చెప్యాల శ్రీనివాస్, సాదిక్ పాల్గొన్నారు.



## ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఘన స్వాగతం

### బిజెపి రామగుండం ఇంచార్జీ కందుల సంధ్యారాణి

పెద్దపల్లి జిల్లా: అక్టోబర్. 12 (వాయిస్ టుడే) గోదావరిఖని: ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గోదావరిఖని పట్టణంలో ఈరోజు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ఆధ్వర్యంలో పథ సంచలన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రామగుండం బిజెపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ఉత్సాహభరిత స్వాగత నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్దకు చేరుకున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు కందుల సంధ్యారాణి స్థానిక మహిళలతో కలిసి పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. "రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ భారతదేశ ఆత్మను ప్రతిబింబించే సంస్థ అన్నారు. సేవ, శిస్తు, దేశభక్తి, సాంస్కృతిక గౌరవం అనే విలువలను ప్రతి భారతీయుడిలో నాటే శక్తిగా ఆర్ఎస్ఎస్ నిలిచిందని తెలిపారు. సమాజ సేవ ద్వారా దేశ నిర్మాణం అనేది సంఘం లక్ష్యం అన్నారు. పథ సంచలన్ ద్వారా క్రమశిక్షణ, ఏకతా, దేశప్రేమను ప్రజల్లో చాటడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం అని,దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందన్నారు. వారు ఈ విలువలను పాటించి ముందుకు సాగితే భారతదేశం మరింత బలమైన హిందూ సంస్కృతి ఆధారిత రాష్ట్రముగా ఎదుగుతుంది" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, కోట తిరుమల, జక్కుల పద్మ, దాసరి సుమలత మరియు స్నేహ మిత్ర కిట్టి పార్టీ సభ్యులు మంజుల, మమత, అక్షిత, రజిత, రోజా, పద్మ, జయ, శైలజ, కాంత, విద్య పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ శతాబ్ది ఉత్సవాల్లో వివిధ కార్యక్రమాలు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) పై చర్చలు, దేశభక్తి, జాతీయభావం, సంఘతా పార్టీ మార్గదర్శకాలు ముఖ్య అంశాలుగా కొనసాగాయి.ప్రధాన కార్యక్రమాలుశతాబ్ది ఉత్సవాల్లో స్వచ్ఛంద సేవలు, సంఘ్ ప్రయాణంపై స్మృతి కార్యక్రమాలు నిర్వహించారు.కేంద్రంలో ప్రముఖ నాయకులు, సంఘ్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా RSS 100 సంవత్సరాల ప్రయాణాన్ని ప్రశంసిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసింది.రంగు వేదికలపై సందేశాలు RSS స్థాపకుడు డాక్టర్ హెడ్గేవార్ 1925లో సంస్థను ప్రారంభించాడని, 100 సంవత్సరాలుగా దేశదేశాల్లో జాతీయ చైతన్యం, సామాజిక సేవలు కొనసాగుతున్నాయని సంఘ్ నాయకులు గుర్తు చేశారు."రాష్ట్రే స్వాహా, ఇదం రాష్ట్రాయ ఇదం న మమ" అనే నినాదంతో స్వయం సేవలో దేశానికి సేవ చేస్తున్న సంఘ్ సంస్థ ప్రయాణాన్ని వివరించారు.సంబంధిత విషయాలు & ప్రభావం దేశవ్యాప్తంగా RSS శతాబ్ది ఉత్సవాలు తెరపై ఉన్నప్పటికీ, తెలంగాణాలో కూడా వివిధ జిల్లాల్లో కార్యక్రమాలు కొనసాగాయి.సంఘ్ ఉత్సవాల్లో ప్రజల్లో జాతీయ భావం పెంపొందించడంపై దృష్టి పెట్టారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన RSS 100 సంవత్సరాల శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు, సిరిసిల్ల నాయకులు పాల్గొన్నారు.

# ఈటల పేరు వింటేనే కౌశిక్ రెడ్డి వెన్నులో వణుకు

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు



జమ్మికుంట అక్టోబర్ 12 (వాయిస్ టుడే): ఈటల పేరు వింటేనే కౌశిక్ రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు అన్నారు. ఆదివారం రోజు జమ్మికుంట లోని ఒక ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు ఎర్రబెల్లి సంపత్ రావు, మాడ గౌతమ్ రెడ్డి,శీలం.శ్రీనివాస్, బండి కళాధర్ లు మాట్లాడుతూ హుజురాబాద్ శాసనసభ్యులు కౌశిక్ రెడ్డి మాటిమాటికి ఆ సందర్భంగా ఈటల రాజేందర్ పైన అవాకులు చేవాకులు మాట్లాడడాన్ని బిజెపి నాయకులు ఖండించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి బీసీలను మోసం చేయడాన్ని ఈటల రాజేందర్ పత్రిక ముఖంగా ఎండ గట్టారని, రాజ్యాంగ బద్ధంగా నిలువ నటువంటి రిజర్వేషన్లు ఇచ్చి బీసీ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తున్నారని దీనిపైన బీసీలందరూ జాగ్రత్తగా ఉండాలని, తొందరపడి ఎన్నికల్లో పూర్తిచేసే వ్యక్తులు ఎవరు కూడా డబ్బులు ఖర్చు పెట్టకూడదని, ఈటల రాజేందర్ ముందే చెప్పారని, దీనితో యావత్ తెలంగాణ వ్యాప్తంగా అన్ని పార్టీల నుండి పోటీ చేసే ఆశావాహులు ఈటల రాజేందర్ ఇచ్చిన పిలుపుకు హర్షం వ్యక్తం చేశారని బిజెపి నాయకులు గుర్తు చేశారు. కోర్టు తీర్పు అనంతరం హుజురాబాద్ లో ఈటల రాజేందర్ ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తప్పు అంటారని, గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాదారణ ఉన్నటువంటి బిజెపి వ్యక్తులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకుంటామని ఇటల రాజేందర్ చెప్పారని, కానీ ఎలాంటి సంబంధంలేని కౌశిక్ రెడ్డి ఆసందర్భంగా ఈటల రాజేందర్ హుజురాబాద్, మల్కాజ్గిరి ప్రజలను మోసం చేస్తున్నాడని,అతని రాజకీయ జీవితం అయిపోయిందని కౌశిక్ రెడ్డి మాట్లాడడం దుర్మార్గమని బిజెపి నాయకులు అన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పటికీ హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఏ ఆపద వచ్చిన నేనున్నానని భరోసా ఇచ్చి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే వ్యక్తి ఈటల రాజేందర్ అని బిజెపి నాయకులు కితాబిచ్చారు.. కౌశిక్ రెడ్డికి దమ్ముంటే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశాడో చెప్పాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఇక్కడ ఎమ్మెల్యేగా లేనప్పటికీ ఈటల రాజేందర్ కౌశిక్ రెడ్డి కంటే ఎక్కువ హుజురాబాద్ ప్రజలకు సర్వీస్ చేస్తున్నాడని, దీనిపైన చర్చకు కౌశిక్ రెడ్డి సిద్ధమా అని వారు సవాల్ విసిరారు. 20 సంవత్సరాలుగా హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలను ఈటల రాజేందర్ కంటికి రెప్పలాగా కాపాడుకున్నాడని, కానీ నువ్వు గెలిచిన తర్వాత కనీసం హుజురాబాద్ ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆరోపించారు. ఈటల రాజేందర్ పైన ఆరోపణలు చేస్తే గొప్ప నాయకుడిని అవుతాను అనుకుంటున్నావు కానీ హుజురాబాద్ ప్రజలు నిన్ను అసహ్యించుకుంటున్నారనే విషయం నీకు తెలవకపోవడం బాధాకరమని అన్నారు. కుటుంబంతో సహా చస్తామని చెప్పి ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసి హుజురాబాద్ ప్రజలను మోసం చేసి గెలిచిన నీకు ఈటల రాజేందర్ ను విమర్శించే అర్హత లేదని తెలిపారు. ఈటల రాజేందర్ ను విమర్శించడం అంటే ఆకాశం మీద ఉమ్ము వేసినట్టే ఉంటుందని బిజెపి నాయకులు చురకలు అంటించారు. గత 20 సంవత్సరాలుగా టిఆర్ఎస్ లో ఉన్నప్పుడు ఈటల రాజేందర్ స్థానిక సంస్థ ఎన్నికల్లో టికెట్లు ఇచ్చారని, ఆ విషయం నీ పక్కనున్న నాయకులను అడిగి తెలుసుకోవాలని కౌశిక్ రెడ్డికి సూచించారు. నీవు చిల్లర గాడివి, టికెట్లు అమ్ముకునే బ్లాక్‌మేలర్ అని చెప్పి నీ పట్ల నీ అధినాయకత్వానికి నమ్మకం లేదు కనుకనే నీకు టికెట్లు ఇచ్చే పరిస్థితి లేదు అని తెలిసి మాట్లాడుతున్నావని బిజెపి నాయకులు ఘాటుగా వాక్యానించారు. హుజురాబాద్ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, హుజురాబాద్ అభివృద్ధి కోసం పనిచేయవలసిన నీవు వాటిని గాలికి వదిలేసి రీల్స్ చేసుకుంటూ కాలయాపన చేస్తున్నావని, బిజెపి నాయకులు మండిపడ్డారు. ఇలాంటి చిల్లర వేషాలు వేసే నీకు ఈటల రాజేందర్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని, మరొసారి ఈటల రాజేందర్ గారి గురించి అవాకులు చవాకులు మాట్లాడితే ఖబర్దార్ అని బిజెపి నాయకులు హెచ్చరించారు. రాబోయే రోజుల్లో హుజురాబాద్ నియోజకవర్గం లో నిన్ను తరిమికొట్టే రోజులు వస్తాయని బిజెపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు, బిజెపి హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, బిజెపి నాయకులు బండి కళాధర్, బిజెపి జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, బిజెపి నాయకులు మాసాడి ముత్యం రావు, పల్లె వెంకట్ రెడ్డి, పెద్ది మల్లారెడ్డి, జీడి మల్లేష్, సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, నల్ల సుమన్, కంకణాల రమారెడ్డి, గాదె మహేష్, కొమ్ము అశోక్, కొత్త శ్రీనివాస్, ఎనగంటి శ్రీనివాస్, కోరే రవీందర్, రాచపల్లి వెంకటేష్, ఇజ్జగిరి సంపత్, సుంకరి శ్రీరామ్ రెడ్డి, పల్లపు రవి, పుప్పాల రాములు, మోడెం రాజు, గండికోట సమ్మయ్య, ఉడుగుల మహేందర్, గాలేటి సురేందర్ రెడ్డి, మౌటం వెంకటేష్, బొబ్బల విజయా రెడ్డి, బాపూరావు, రవిచందర్ రెడ్డి, గండికోట సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 18న జరిగే తెలంగాణ రాష్ట్ర బంద్‌కు సహకరించండి



హుజూర్ నగర్, అక్టోబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి): బీసీలకు స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్ విషయముపట్ల హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 18 న తెలంగాణలో జరగనున్న బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూర్నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాళ శ్రీనివాస్ , సిఐటియు నాయకులు ఎల్క సోమయ్య గౌడ్ , బిఆర్ఎస్ పార్టీ నాయకులు ములకలపల్లి రాంబాబు లు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాడు వారు హుజూర్ నగర్ లోని బీసీ ముఖ్య నేతలతో, ప్రజాసంఘాల నాయకులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ.... గత ఎనిమిది దశాబ్దాలుగా బీసీలు సామాజికంగా రాజకీయంగా విద్యా పరంగా ఉపాధి పరంగా అణచివేతకు గురవుతున్నారని బీసీ సంఘాల నేతలు వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ స్థాయిలో చేస్తున్న అనేక ఉద్యమాలు ఆందోళన ఫలితంగా దిగి వచ్చిన ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల్లో కుల గణన చేపట్టి, ఎంతోకొంత బీసీల అభ్యున్నతి కొరకు కృషి చేస్తున్నాయని అయితే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో బిల్లు పెట్టి ఆమోదించి కేంద్రానికి పంపితే కేంద్రంలో అధికారంలో ఉన్నవారు ఆ బిల్లు ఆమోదించకుండా గత ఆరు నెలల కాలంగా బిల్లు తొక్కిపెట్టి నారని అన్నారు.ఇటీవల తెలంగాణ హై కోర్ట్ 56. 33 శాతం ఉన్న బీసీ జనాభా కేవలం 42 శాతం రిజర్వేషన్ కి అంగీకరించాయని చట్టసభల్లో 50% రిజర్వేషన్ కొరకు ఉద్యమిస్తానికి సిద్ధంగా ఉన్నాయని ఇటీవలనే బీసీ జేఏసీ ఏర్పాటు కావడం శుభపరిణామం అని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని నిర్మించి చట్టసభల్లో 50% రిజర్వేషన్ సాధించి తీరుతామని వారు ధీమా వ్యక్తం చేశారు.

రిజర్వేషన్ అనేది మా హక్కు అని మా హక్కును సాధించుకునేందుకు మడమ తిప్పని పోరాటం చేస్తామనీ18వ తేదీ బంద్ లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం పట్టణ మహిళా అధ్యక్షురాలు రావినూతల ఇందిరా, లక్కవరం గ్రామ శాఖ అధ్యక్షులు ఓరుగంటి మధు గౌడ్, సిఐటియు నాయకులు ,ముత్యం నాగమణి, వార్డ్ అధ్యక్షులు, కర్నే కృష్ణ, వట్టికూటి శ్రీనివాస్ గౌడ్, శెట్టి శ్రీనివాస్, గంజి శివ,బండి నాగేశ్వరరావు, కొత్తూరి బ్రహ్మచారి,కొట్టు శేఖర్, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, కంచర్ల కుంట్ల కాశీరాం, కొట్టు బాబు, గొట్టే అంజి యాదవ్, పుప్పాల రవి, చలి కంటి గణేష్, ఆవుల వెంకటేశ్వర్లు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సీఎం ఓఎస్‌డీ

రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఓ.ఎస్.డీ వేముల శ్రీనివాస్ రాజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందస్తుగా ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి: వాచనంతో స్వాగతం పలికారు. తదుపరి దర్శనం మరియు అనంతరం మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ప్రధాన ఆలయ ఏ.ఈ.ఓ బి.శ్రీనివాస్, వేముల శ్రీనివాస్ కి శేష వస్త్రం కప్పి, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.



## ముస్తాబాద్, మొరాయి పల్లె, చిప్పల పెల్లి గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : ముస్తాబాద్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం చైర్మన్ అన్నం రాజేందర్ రెడ్డి, పోతు గల్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నర్సింలు, ముస్తా బాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి వడ్ల కోనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ,పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అన్నారు. వరి కోతలు పూర్తిస్థాయిలో మొదలుకాకముందే ఏర్పాటు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. రైతు లారా దళారుల , ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి వట్ల ను మిల్లర్లకు గాని ఇతర దళారులకు అమ్ముకో వద్దు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి గింజ కొనుగోలు చేస్తుంది మద్దతు ధర చెల్లిస్తుంది ఎవరు అధైర్య పడవద్దు అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామస్థాయి నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు రైతులు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



### శ్రీ రాజరాజేశ్వర స్వామి దర్శనాలను నిలిపివేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ..

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన

రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ బిజెపి అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పేరుతో దర్శనాలను నిలిపివేయడం బిజెపి తీవ్రంగా ఖండిస్తుంది.మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు, కానీ భక్తుల మనో భావాలను దెబ్బతీయడం అన్యాయం. రాజన్న అనేది బీదల దేవుడు ,ఆయన నిత్య దర్శనాలకు అడ్డంకులు లేకుండా అభివృద్ధి జరగాలి. హిందూ భక్తుల మనోభావాలను గౌరవించాలి, లేని పక్షంలో ఆలయ తలుపులు బద్దలు కొట్టి అయినా స్వామివారి దర్శనాలు ప్రారంభం అయ్యేలా చేస్తాం” అని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా బీజేవైఎం మాజీ అధ్యక్షులు రాగుల రాజిరెడ్డి , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు వోరగొండ రాజు, పల్లికొండ నర్సయ్య ,మోర శ్రీహరి, మెరుగు శ్రీనివాస్, రచ్చ రాహుల్, సిద్ధి దేవరాజు కనకయ్య ,గాలి శ్రీనివాస్, దూరం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి

### రాజన్న ఆలయం బంద్ అనేది అవాస్తవం.



రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి భాగంలో,అందరి సలహాలు, సూచనల మేరకు గుడి అభివృద్ధి, విస్తరణ పనులు చేస్తున్నాం.150 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి, రోడ్డు వెడల్పు కార్యక్రమం కూడా పూర్తవుతుంది.రాజన్న ఆలయ మూసివేత ఉండదు.స్వామివారికి నిత్య పూజలు జరుగుతున్నాయి. సుప్రభాతం మొదలుకొని,, రాజన్నకు మొక్కలు,ఇతర పూజలకు అన్ని జరుగుతున్నవి. భీమేశ్వరాలయంలో అన్ని ఏర్పాట్లు, చేశారు.ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరూ సహకరించాలి.ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలియజేశారు, స్థానిక భక్తులు, పలువురు ఆలయ అధికారులు పాల్గొన్నారు.



## రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాలు

### మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం

రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పథ సంచలన్ కు ఘనమైన స్వాగతం పలికిన పలు మహిళా సంఘాలు, సిరిసిల్ల శాంతినగర్ లోని పోకల భవాని ఆధ్వర్యంలో మహిళా బృందం, పూర్వక స్వాగత ఏర్పాట్లు ,మంగళహారతుల తో పూలవర్షంతో, అంగరంగ వైభవంగా ఘనమైన స్వాగతం ,స్వయం సేవకులకు పలికారు. కార్యక్రమంలో పోకల భవాని వారి బృందం... రౌతు పూజిత, కమటం మంజుల, సోమిశెట్టి సౌజన్య, కొలుకూరి భూలక్ష్మి ,చౌడు బోయిన కౌసల్య, లతా, నవీన, వనిత మల్లీశ్వరి, రేవతి, విజయ, గూట్ల అనుష ,తదితరులు పాల్గొన్నారు..

## విధి నిర్వహణలో చనిపోయిన గ్రామపంచాయతీ కార్మికుడు రమేష్ కుటుంభానికి ప్రభుత్వం 10 లక్షల ఆర్థిక సాయం అందించాలి

### కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ డిమాండ్



రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే) అక్టోబర్ 12 : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట గ్రామంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు రమేష్ నిన్నటి రోజు పనిలో భాగంగా చెరువులో ఉన్న బావిలో నీటి పంపు రిపేర్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మరణించడం జరిగింది. అతని మృతి దేహాన్ని సిరిసిల్లలోని గవర్నమెంట్ హాస్పిటల్ పోస్టుమార్టం నిర్వహించడానికి తీసుకురావడం జరిగింది. ఈరోజు హాస్పిటల్ వద్దకు సిపిఎం నాయకులు గ్రామపంచాయతీ కార్మికులందరూ చేరుకుని రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ముశంరమేష్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల ప్రాణాలంటే ప్రభుత్వానికి లెక్కలేనట్టుగా ఉన్నది ,చెరువులో బావి దగ్గరికి వెళ్లడానికి వీలు లేకుండా కూడా వెళ్తే ప్రమాదం జరుగుతుందని తెలిసి కూడా బలవంతంగా రమేష్ పని చేయాలని తోలించడం వలన రమేష్ మరణించడం జరిగింది రమేష్ మరణానికి బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే వహించాలి అన్నారు. సిపిఎం కార్యకర్తలు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్‌లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్

### 143 మంది రోగులకు పరీక్షలు కార్డియాలజీ, న్యూరో, గ్యాస్ట్రో, యురాలాజీ , నెఫ్రో తదితర విభాగాల్లో సేవలు

భద్రాద్రి కొత్తగూడెం (వాయిస్ టుడే) అక్టోబర్ 12: సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు సూపర్ స్పెషాలిటీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించబడింది. కార్డియాలజీ & న్యూరాలజీ– నిఖిల్ హాస్పిటల్ ,హైదరాబాద్ యురాలజి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ & నెఫ్రాలజీ –డెక్కన్ హాస్పిటల్ నిపుణ వైద్యులు ఈ క్యాంప్‌లో సేవలు అందించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు , పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఈ క్యాంప్‌లో పాల్గొన్నారు. మొత్తం 143 మంది రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ హెల్త్ క్యాంప్‌ను చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యన్. బలరాం ఆదేశాల మేరకు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు సలహా, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ సూచనలతో ఏర్పాటు చేశారు. అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనస్థీషియాలజిస్ట్ కాళేశ్వర రావు, హెల్త్ ఆఫీసర్ డా. లలిత, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ పి.బి. అవినాష్, హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## రైతు బజార్ లో కొనుగోళ్లు ప్రారంబించాలి

### ప్రారంభం అయి నెలలు గడిచిన రైతు బజార్‌లో కొనుగోల్లు జరపించడం లేదు

### బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతి ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య అయిలేని మల్లికార్జున రెడ్డి

వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 13 హుస్నాబాద్ ప్రతినిధి : హుస్నాబాద్ పట్టణంలో రైతు బజార్ నిర్మాణం కోసం మూడు కోట్ల రూపాయలతో నిధులు పెట్టి పనులు పూర్తి చేసి దాదాపు ఎనిమిది నెలల క్రితం రైతు బజార్‌ను ప్రారంబించినారు కానీ ఇంత వరకు కొనుగోల్లు ప్రారంభం కాలేదు. రైతు బజార్ లేక పోవడంతో బహిరంగ రోడ్ల పక్కనే కూరగాయల వ్యాపారులు అమ్ముకుట్టున్నారు దాని వలన కూరగాయలు కొనుగోలు చేసే ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. కనీసం ఇప్పటికైన వెంటనే రైతు బజార్‌లో కొనుగోళ్లు ప్రారంబించి కొనుగోళ్ళలో వ్యాపారులకు మరియు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని బి ఆర్ యస్ పార్టీ కోరుతుంది. ఈ కార్యక్రమంలో బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సూద్దాల చంద్రయ్య అయిలేని మల్లికార్జున రెడ్డి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఇంద్రాల సారయ్య పార్టీ నాయకులు పాకాల శ్యామ్ సుందర్ గౌడ్ మల్కి రెడ్డి మోహన్ రెడ్డి మేకల వికాస్ యాదవ్ బూర వెంకన్న గౌడ్ పాల్గొన్నారు.

## కొత్తగూడెం క్లబ్‌లో ఉత్తమ బతుకమ్మ అవార్డు



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 12: కొత్తగూడెం క్లబ్‌లో ఉత్తమ బతుకమ్మ అవార్డు ప్రదానోత్సవం ఘనంగా యూట్యూబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో “ఉత్తమ బతుకమ్మ అవార్డు” కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. షాబీర్ పాషా హాజరై బతుకమ్మ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా షాబీర్ పాషా మాట్లాడుతూ.. “బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక. ఈ పండుగ సాంస్కృతిక ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతిబింబం. ఇలాంటి సాంప్రదాయ పండుగల ద్వారా మన సంస్కృతి నిలబెట్టుకోవాలి,” అని అన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా బృందాలు పాల్గొని అందమైన బతుకమ్మలను తయారు చేశారు. విజేతలకు సన్మాన పత్రాలు, అవార్డులు అందజేశారు.

# ఈనెల 18న జరిగే రాష్ట్ర బంద్‌కు సహకరించండి

## అన్ని వర్గాల వారికి బిసి మహిళా నాయకురాళ్ల విజ్ఞప్తి



హుజూర్ నగర్, అక్టోబర్ 12 (వాయిస్ టుడే ప్రతినిధి) బీసీలకు స్థానిక సంస్థల్లో 42 రిజర్వేషన్ విషయముపట్ల హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల18 న తెలంగాణలో జరగనున్న బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మేళ్లచెరువు పట్టణ మహిళ అధ్యక్షురాలు ఆలేటి నవ్య, వార్డు అధ్యక్షులు కంచి అమ్మాజీ, తమ్మిశెట్టి వెంకమ్మ లు విజ్ఞప్తి చేసినారు.

ఆదివారం నాడు మేళ్లచెరువు పట్టణం లోని బీసీ ముఖ్య నేతలతో కలిసిపాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ఎనిమిది దశాబ్దాలుగా బీసీలు సామాజికంగా రాజకీయంగా విద్యా పరంగా ఉపాధి పరంగా అణచివేతకు గురవుతున్నారని బీసీ సంఘాల నేతలు వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ స్థాయిలో చేస్తున్న అనేక ఉద్యమాలు ఆందోళన ఫలితంగా దిగి వచ్చిన ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాల్లో కుల గణన చేపట్టి, ఎంతోకొంత బీసీల అభ్యున్నతి కొరకు కృషి చేస్తున్నాయని అయితే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కోసం తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో బిల్లు పెట్టి ఆమోదించి కేంద్రానికి పంపితే కేంద్రంలో అధికారంలో ఉన్నవారు ఆ బిల్లు ఆమోదించకుండా గత ఆరు నెలల కాలంగా బిల్లు తొక్కిపెట్టి నారని వారు అన్నారు.

56. 33 శాతం ఉన్న బీసీ జనాభా కేవలం 42 శాతం రిజర్వేషన్ కి అంగీకరించాయని చట్టసభల్లో 50% రిజర్వేషన్ కొరకు ఉద్యమిస్తానికి సిద్ధంగా ఉన్నాయని ఇటీవలనే బీసీ జేఏసీ ఏర్పాటు కావడం శుభపరిణామం అని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని నిర్మించి చట్టసభల్లో 50% రిజర్వేషన్ సాధించి తీరుతామని వారు ధీమా వ్యక్తం చేశారు. రిజర్వేషన్ అనేది మా హక్కు అని మా హక్కును సాధించుకునేందుకు మడమ తిప్పని పోరాటం చేస్తామని18వ తేదీ బంద్ లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేళ్లచెరువు పట్టణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొలగాని శివ ,కొనపర్తి నాగరాజుఉపతల వీర కుమారి పోలంగకి శ్రీ కుమారి,ఆవుల రమాదేవిలంకెమల్ల కామేశ్వరమ్మ గోపిశెట్టి లక్ష్మమ్మ, పసుపులేటి లక్ష్మమ్మవేముల అన్నమ్మ,పొట్ట పద్మ తదితరులు పాల్గొన్నారు.

# దామన్న కుటుంబానికి కాంగ్రెస్ అండ

## సంతాప సభలో సీఎం రేవంత్‌రెడ్డి



తుంగతుర్తి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాలుగు దశాబ్దాల పాటు పార్టీ అభ్యున్నతికి నిస్వార్థ సేవలందించి మన నుంచి భౌతికంగా దూరమైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తుంగతుర్తిలోని మినీస్టేడియంలో ఏర్పాటు చేసిన దామోదర్‌రెడ్డిసంతాపసభకు సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 1 గంటకు తుంగతుర్తిలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన 1:10కి మైదానానికి వచ్చారు. ఈ సందర్భంగా సీఎం 12 నిమిషాల పాటు మాట్లాడారు. 'దామోదర్‌రెడ్డికి ఖమ్మం, నల్గొండ జిల్లాలో వారసత్వంగా వచ్చిన వేలాది ఎకరాల భూములను ప్రజాప్రయోజనాల కోసం వదులుకున్నారు. ఆయన కుమారుడికి రాజకీయ పరమైన అవకాశం పార్టీ తప్పకుండా కల్పిస్తుంది. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా'మంటూ సీఎం హామీ ఇచ్చారు.

దామోదర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో పార్టీకి అండగా ఉంటూ జెండాను నిలబెట్టిన యోధుడని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. ఆయన ఆశయం మేరకు జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రాజెక్టులో పూడిక, ఇసుక తొలగిస్తామని, కాలువల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయన స్ఫూర్తితో ఉమ్మడి జిల్లా నేతలందరం కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిపిద్దాం. సర్వోత్తంరెడ్డికి అండగా ఉంటామని అభయమిచ్చారు. కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గంలో1985లో కోటను బద్దలు కొట్టించి ఎమ్మెల్యేగా గెలిచిన దామోదర్‌రెడ్డి నాటి నుంచి కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ ఉన్నతికి కృషి చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గోదావరి జలాల కోసం పోరాటాలు చేశారన్నారు. చిన్ననాటి నుంచి రైతు కష్టాలు చూసి సాగు నీటి ప్రాధాన్యం గ్రహించిన వ్యక్తి దామోదర్‌రెడ్డి అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి సోదరులు నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో పార్టీకి పెద్దదిక్కయ్యారన్నారు.

దామోదర్‌రెడ్డితో కలిసి యువజన కాంగ్రెస్ కమిటీలో పనిచేసిన విషయాన్ని మాజీ ఎంపీ వీహెచ్ గుర్తుచేశారు. ప్రసంగిస్తున్న సీఎం చేతిలో సర్వోత్తంరెడ్డి చేతులను పెట్టి దామన్న బిడ్డకు అండగా ఉండాలని సభాముఖంగా కోరారు. అత్యంత ఆత్మీయుడిని కోల్పోవడం బాధగా ఉందని మాజీ మంత్రి జానారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్‌లు పటేల్ రమేశ్‌రెడ్డి, బెల్లయ్య నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మందుల సామేల్, పద్మావతిరెడ్డి, వేముల వీరేశం, కూనంనేని సాంబశివరావు, రాగమయి, కోరం కనకయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, బాలునాయక్, ఎమ్మెల్సీలు దయాకర్, శంకర్‌నాయక్, సత్యం, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఏఎంసీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి పాల్గొన్నారు. సభకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు వేల సంఖ్యలో హాజరయ్యారు. వారందరికి స్టేడియంలోనే భోజన ఏర్పాట్లు చేశారు. ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో నలుగురు డీఎస్పీలు, ఇద్దరు ఏఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో పాటు 600 మంది పోలీసులను రప్పించి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# ఉరేసుకొని యువకుడి బలవన్మరణం



హాలియా: ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొత్తపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిప్రశాంత్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాతనబోయిన నవీన్(30) స్థానిక ఓ రైస్ మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నవీన్ శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేసి ఇంట్లో నిద్రించగా.. తల్లిదండ్రులు బయట పడుకున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో తల్లి మొగులమ్మ తలుపు తట్టి కొడుకును పిలవగా లేవలేదు. ఆమె చిన్న కుమారుడు కిరణ్, తండ్రి నాగయ్యకు విషయం తెలపడంతో గది తలుపు పగలగొట్టి చూడగా అప్పటికే నవీన్ ఇంటి పైకప్పు ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. నవీన్ ఇటీవల నూతన గృహం కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు బ్యాంకులో సుమారు రూ.5 లక్షలు, బయట మరో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. ప్రతి నెల వాయిదాలు, వడ్డీలు కట్టలేక కొంతకాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఆర్థిక సమస్యలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తమ్ముడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# బాలికల ఆత్మరక్షణ విద్యకు నిధులు



గద్వాల, న్యూటౌన్: నానాటికీ బాలికలపై పెరిగిపోతున్న అఘాయిత్యాలు, దాడుల నుంచి వారిని వారు రక్షించుకునేలా అమ్మాయిలకు పాఠశాలలోనే ఆత్మ రక్షణ విద్య అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి శ్రీయోజన (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా పథకం) పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం సెప్టెంబరు మాసం నుంచే అమలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు కేజీబీవీ, కొన్ని ఎంపిక చేసిన పాఠశాలల్లో మాత్రమే అమలవుతున్న ఈ కార్యక్రమం, ఇకపై అన్ని పీఎంశ్రీ బడుల్లో పక్కాగా అమలు చేయనున్నారు. దీంతో సాధారణ విద్యతో పాటు, బాలికలకు కరాటే, కుంగ్‌ఫూ, జూడో వంటి విద్య నేర్పించనున్నారు. నేర్పించడమే కాకుండా పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి ధ్రువపత్రాలు సైతం అందించనున్నారు.

ఒక్కో పాఠశాలకు రూ.30 వేలు: ఉమ్మడి జిల్లాలో 105 పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయి. వీటిలో చదువుతున్న బాలికలకు ఆత్మరక్షణ విద్య అమలు చేయనున్నారు. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.30 వేల చొప్పున రూ.31.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. విద్య నేర్పించేందుకు అవసరమైన మహిళా శిక్షకురాలిని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంపిక చేయాల్సి ఉంటుంది. వారు ఈ విద్యా సంవత్సరం మొత్తం 72 తరగతులు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ తరగతులను పాఠశాలలోని పీఈటీ లేదా పీడీ పర్యవేక్షణలో 45 నిమిషాల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. తరగతులు పక్కాగా నిర్వహించడం వల్ల బాలికల్లో ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు, చురుకుదనం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.





# మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సిపిఆర్ అవగాహన కార్యక్రమం

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా అక్టోబర్-12 వాయిస్ టుడే: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కవర్ హాస్పిటల్, కరీంనగర్ వారిచే డాక్టర్ ఐల రమేష్ ఆధ్వర్యంలో సిపిఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ కార్డియాలజిస్ట్ అనీష్ పబ్బ పాల్గొని, ఈ సందర్భంగా మాట్లాడుతూ సిపిఆర్ ఒక వ్యక్తికి గుండె ఆగిపోయినప్పుడు లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు చేసే ఒక అత్యవసర ప్రాణ రక్షక ప్రక్రియ అని అన్నారు.సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల మెదడుకు,ఇతర ముఖ్యమైన అవయవాలకు ఆక్సిజన్ కలిగిన రక్తం ప్రసరించేలా చేసి, వ్యక్తి ప్రాణాలను కాపాడవచ్చని, అలాగే వ్యక్తి స్పృహ కోల్పోయి, శ్వాస ఆడటం లేదని లేదా గుండె కొట్టుకోవడం లేదని గుర్తించినప్పుడు వెంటనే సీపీఆర్ చేయాలని తెలిపారు.ఇలాంటి అత్యవసర సమయంలో సిపిఆర్ చేయాలన్నారు.

అనంతరం ఆకస్మికంగా గుండెపోటు వచ్చినప్పుడు సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడడం ఎలా అని డెమో చేసి చూపించారు.అలాగే గుండెపోటు నివారణ, ముందు జాగ్రత్తలు ఆహార అలవాట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారి వైస్ ప్రెసిడెంట్ లు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# ఆల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ.. చదరంగం పోటీలకు ఎంపిక



సుల్తానాబాద్ , పెద్దపల్లి జిల్లా అక్టోబర్-12 వాయిస్ టుడే: చదువుతోపాటు అన్ని రంగాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరుస్తూ ముందుకు వెళ్తున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన పెద్దపెల్లి జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో నలుగురు విద్యార్థులు తమ సత్తా చాటి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.ఎంపికైన విద్యార్థులను ఆదివారం నరేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకులచే నిత్య శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు రాటు దేలుతున్నారని వారిని మరింత ప్రోత్సహించినట్లయితే రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తారని తెలిపారు. ఎంపికైన వారిలో అండర్ పద్నాలుగు సంవత్సరాల బాలికల విభాగంలో శ్రీ వర్షిని యాదవ్, బాలుర విభాగంలో ఎం వాసుదేవ్, అండర్ పదిహేడు సంవత్సరాల బాలుర విభాగంలో పి అనిరుద్, బాలికలు విభాగం లో అనన్యలు ఉన్నారు.వీరిని ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం ప్రత్యేకంగా అభినందించారు..




# బుద్ధవనంలో అక్టోబర్ 14న ధమ్మ విజయ వేడుకలు

నాగార్జునసాగర్ అక్టోబర్ 12 వాయిస్ టుడే ప్రతినిధి : ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ ప్రదేశంలో, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనంలో ధమ్మ విజయ వేడుకలను నిర్వహిస్తున్నట్లు బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలియజేశారు. సామ్రాట్ అశోక చక్రవర్తి 2300 సం? క్రితం బౌద్ధాన్ని స్వీకరించిన అశోక విజయ దశమి (అక్టోబర్ 14), రోజునే భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 1956, అక్టోబర్ 14న, నాగపూర్ లో ధమ్మ దీక్షను తీసుకున్న రోజును ధమ్మ విజయ దినంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

ఈ సందర్భంగా 14 ఉదయం 11.00 గం. లకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రొ. మహేష్ దియోకర్, పూణె యూనివర్సిటీ, దమ్మవిజయ విశిష్టత గూర్చి ప్రసంగిస్తారు. అలాగే మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఖాజా ఆల్తాఫ్ హుస్సేన్ గారు, ప్రొ. కె. ముత్యంరెడ్డి గారు, సెక్రటరీ, రెడ్డి మహిళా కళాశాల, హైదరాబాద్ , . మాధవి లత , ప్రిన్సిపాల్, నాగార్జునసాగర్ తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించనున్నారు. కావున స్థానిక విధ్యార్థులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్లేపల్లి లక్ష్మయ్య ఒక ప్రకటనలో కోరారు




# ఫ్యూచర్ సిటీలో మెరవనున్న సింగరేణి!

కొత్తగూడెం సింగరేణి,: అరుదైన లోహాలను కనుగొనేందుకు అనుమతులు పొందిన సింగరేణి.. వివిధ దేశాల నైపుణ్య సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు హైదరాబాద్‌లో అంతర్జాతీయస్థాయి కార్యాలయం నెలకొల్పాలని సంకల్పించింది. ఇందులో భాగంగా స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈమేరకు ఫ్యూచర్ సిటీలో పదెకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు.

**త్వరలో కేటాయింపు**

హైదరాబాద్ సమీపంలో ఏడు మండలాల పరిధిలోని 56 గ్రామాలను కలుపుతూ 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని సర్కారు నిర్మిస్తోంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలను నెలకొల్పేందుకు అంతర్జాతీయ స్థాయి కంపెనీలనూ ఆహ్వానిస్తోంది. ఇందులో పదెకరాలను సింగరేణికి కేటాయించాలని నిర్ణయించింది. హక్కుపత్రాలను త్వరలో అప్పగించనుంది. ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ కార్యాలయం నిర్మాణానికి సింగరేణి సన్నద్ధమవుతోంది. భవన నమూనాలపై నిపుణులను సంప్రదిస్తోంది. 'భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి కార్యాలయం రూపుదిద్దుకుంటుంది' అని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తెలిపారు.

# అదనపు కట్నం కోసం ఏఆర్ కానిస్టేబుల్ వేధింపులు

ఖమ్మం: అదనపు కట్నం కోసం భార్యను వేధించడంతో పాటు దాడి చేసి తీవ్రంగా హింసించిన ఘటనలో ఏఆర్ కానిస్టేబుల్‌పై శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు కథనం మేరకు.. మధిర బంజారా కాలనీకి చెందిన వనమా శ్రీకాంత్ ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. అతనికి హన్మకొండకు చెందిన మౌనికతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా ఆమెను అదనపు కట్నం కోసం శ్రీకాంత్ వేధిస్తున్నారు. పలుమార్లు బంధువులు, పోలీసుల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా ప్రవర్తనలో మార్పు రాలేదు. శుక్రవారం రాత్రి ఆమెపై తీవ్రంగా దాడి చేశారు. ఒంటి నిండా కమిలిన గాయాలతో మౌనిక మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్, అతని తల్లి నాగమణిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. బాధితురాలిని ఆసుపత్రికి తరలించారు. ఆమె ఒంటిపై కమిలిన గాయాలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి.